లను ఆకర్షించే కిటుకులు గంగవ్వ చెప్పేది.

కొత్త వాళ్లయితే..

''యాపారానికి కొత్తబాబు! మా అన్న కూతురు కాత్త చూసి..'' అంటూ నసిగేది.

నన్ను కూడా అలానే నడుచుకోమనేది. దాంతో వాళ్లు కన్నెరికం చేస్తున్నట్లు పొంగిపోయి డబ్బు వెదజల్లేవారు.

పాత వాళ్లయితే..

''మా పిల్ల ఎప్పుడు మిమ్మల్నే తలుత్తా ఉంటది'' అంటూ ఉబ్బేసేది.

* * *

పులి మీద పుట్రలా వచ్చిపడిన కరోనా మమ్మల్ని చావు దెబ్బ కొట్టింది. అప్పటివరకూ ఉన్న డబ్బులు పురిటికి, పాప వైద్యానికి సరిపోయాయి. గంగవ్వ ఎంత జాగ్రత్తగా వాడుతున్నా సరుకులు నిండుకుంటున్నాయి. ఒకరోజు నీరసంగా పడుకుని ఉన్న నన్ను లేపి టీ గ్లాసు, బన్ను చేతిలో పెట్టిన గంగవ్వకు సగం విరిచి ఇవ్వబోయాను.

''వద్దమ్మా! నువ్వు తిను తల్లి! మద్దేనం నూకలు కాసినప్పుడు నేను కూడా జావ తాగుతాలే. కడుపులో ఏమీ లేకుంటే పాపకు పాలు రావు. తిను తల్లి!'' అంటూ బలవంతంగా తినిపించింది. నిజమే.. రాత్రంతా పాలు సరిపోక పాప ఏడుస్తూనే ఉంది. ఇప్పుడు సొమ్మసిల్లినట్లు పడుకుంది. 'ఆకలి' ఇది ఒక్కటి పెట్టి దేవుడు మనిషి మీద కక్ష సాధిస్తున్నాడు అనిపించింది నాకు. గట్టి పడిపోయిన ఆ బన్నును టీలో నానబెట్టి తిని పడుకున్నాను.

కరోనా వల్ల గంగవ్వ పనిచేసే ఇళ్లవాళ్లు కూడా పనివాళ్లను రానివ్వకుండా వాళ్లే పనులు చేసుకుంటున్నారు. లేకపోతే ఒక్కపూటైనా మా కడుపులు నిండేవి. కాసేపటికి నిద్దట్లో పాల కోసం తడుముకుంటున్న పాప నోటికి రొమ్ము అందించాను. కాసిన్ని చుక్కలు వచ్చినట్లు ఉన్నాయి. వాటినే చప్పరిస్తూ తాగి, నిద్రలోనే నవ్వుకుంటున్న పాపను..

'ఎంత అందంగా ఉంది నా పాప!' అనుకుంటూ మరింత దగ్గరికి తీసుకున్నాను. అంతలోనే నా మొహం మ్లానమైంది. ఆలోచనలు తేనెపట్టును కదిపినట్లు ముసురుకుంటున్నాయి.

''దొంగ సచ్చినోడు! ఎంత మాటన్నాడు. ఈడి దివసం పెట్టా!'' తిట్టుకుంటూ లోపలికి వచ్చింది గంగవ్వ.

''ఎవర్ని అంతలా శాపనార్థాలు పెడుతున్నావు?'' పేలవంగా నవ్వుతూ అడిగాను.

''ఆ గౌడుగేద గాడికి, ఆ కర్రి మొహం గాడికి నువ్వు కావాలంట. నేకపోతే అప్పు పుట్టదని సెప్పేసినాడు'' మెటికలు విరిచింది గంగవ్వ.

**కాపాడాల్సిన కన్నతండ్రి అన్యాయం చేసాడు. ఎటువంటి బంధం లేని ఈ మహాతల్లి కంటికి రెప్పలా కాస్తున్నది. ఎంత నల్లమబ్బుకైనా వెండి అంచు ఉంటుందంటే ఇదే కాబోలు అనుకున్నాను.**

కరోనా వల్లగాని.. లేకుంటే గురవయ్యకు ఆమాట అనే ధైర్యం ఉండేది కాదు. ఇప్పుడు అవసరం కొద్దీ లొంగుతానని వాడి ప్లాన్ అయ్యుంటుంది.

మర్నాడు గంగవ్వను పిలిచి..

''అతణ్ని రమ్మన్నానని చెప్పు'' అన్నాను.

కళ్లు పెద్దవి చేస్తూ చూస్తున్న గంగవ్వను చూసి..

''ఈరోజుల్లో ఏదీ ఆశించకుండా ఎవరైనా ఏం చేస్తారు గంగవ్వ! ఎవరో నీలాంటి పిచ్చి తల్లులు తప్ప!''.. నవ్వుతున్న నన్ను చూసి గంగవ్వ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆ రాత్రి తొమ్మిది దాటాక రమ్మని గురవయ్యకు చెప్పి వచ్చింది.

పక్క గదిలో మంచం మీద ఉతికిన దుప్పటి వేసి రెండు అగరొత్తులు వెలిగించింది. గురవయ్య రాగానే పాల గ్లాస్ చేతికి అందించింది.

''గదిలో తాగేవాణ్నిగా?'' వెకిలిగా అంటూ, నన్ను తినేసేలా చూస్తూ పాలు తాగాడు.

''తమరు గదిలో పడుకోండి బాబు! అమ్మాయిని సిటికెలో అంపేత్తాను!'' అంటూ గదిలోకి దారితీసింది. వాడి చవక రకం సెంటు వాసన గుప్పున కొట్టి నా కడుపులో తిప్పింది.

''ఏంటది లైట్ తీసేసావు?'' అంటున్న గురవయ్యతో..

''మా పిల్లకు లైట్ ఉంటే నచ్చదు బాబు!'' అంటున్న గంగవ్వ మాటలు వినిపించాయి.

''బెడ్‌లైట్ అయినా ఉంచు'' అంటుంటే..

''అది పాడైపోనాది బాబు! అయినా సిత్రాలు పోతున్నారు ఏంటి? మా పిల్ల పెద్ద ఎలుగు కాదేంటి తమరికి?''.

కితకితలు పెట్టినట్లు గురవయ్య నవ్వు వినిపించింది.

''సుమమ్మా! నువ్వు పాపను ఏడవకుండా సూడు'' అంటూ గబగబా సిల్క్ చీర చుట్టబెట్టుకుని, మొహానికి పౌడర్ రాసుకుని గదిలోకి వెళ్లి, తలుపు గడియ పెట్టేసింది గంగవ్వ. ఏం జరిగిందో నా మెదడు గ్రహించడానికి కొన్ని నిమిషాలు పట్టింది. తెలతెలవారుతుండగా గురవయ్య తూలుతూ బయటికి వెళ్లిపోయాడు.

మర్నాడు గంగవ్వ పగిలి, రక్తం కారుతున్న పెదాలు, గోళ్లతో నిండి ఉన్న ఒళ్లు చూస్తే నా కళ్లు ధారాపాతంగా వర్షించాయి.

''ఎందుకు తల్లీ అలా బాధపడతావ్? నేనేమైనా మగాడి సెయ్యి ఎరగని దాన్నా? నీదసలే పచ్చి బాలింత ఒళ్లు. ఆడ్ని తట్టుకోగల్దు వేటి? పాలల్లో కాసంత నల్ల మందు కలిపినాను కాబట్టి ఆ మాత్తరం అయినా ఉన్నాడు. నువ్వే అనుకుని.. 'సుమా! సుమా!' అంటానే ఉన్నాడు ఎదవ!''.. నవ్వుతున్న గంగవ్వను చూస్తూ దండం పెట్టాను.

''సాల్లే తల్లీ.. తప్పు! కూసేపు పడుకుని లేసి ఆడి కొట్లో సరుకులు తెత్త!'' అంటూ ఒరిగింది గంగవ్వ.

కాపాడాల్సిన కన్నతండ్రి అన్యాయం చేసాడు. ఎటువంటి బంధం లేని ఈ మహాతల్లి కంటికి రెప్పలా కాస్తున్నది. ఎంత నల్లమబ్బుకైనా వెండి అంచు ఉంటుందంటే ఇదే కాబోలు అనుకున్నాను.

''ఎవరైనా ఉన్నారా లోపల?''.. బయటి నుంచి ఆడగొంతు వినిపించింది.

''ఎవరూ?'' అంటూ బయటికి నడిచింది గంగవ్వ.

నేను తొంగి చూశాను. కొంచెం దూరంగా కారు కనిపిస్తున్నది. గంగవ్వతో మాట్లాడుతున్న ఆవిడ చీర కొంగు రెపరెపలాడుతూ కనిపించింది.

''మరేం లేదమ్మా.. ఈ రోజుల్లో అందరిలాగానే మీరు కూడా ఎన్నో ఇబ్బందులు పడుతూ ఉంటారని అనిపించింది. కాస్త బియ్యం, పప్పు కొన్ని నిత్యావసరాలు పంచుదామని వచ్చాం. ఇల్లిల్లు తిరిగి ఇవ్వడం కష్టం కదా.. నువ్వు అందర్నీ అంటే ఇంటికి ఒకరు చొప్పున ఇక్కడికి తీసుకురాగలవా?'' అడుగుతున్నది ఆవిడ.

''ఎంత మంచి మనసమ్మా మీది? మాలాంటి వాళ్ల ఇళ్లకు వచ్చి మరీ ఇత్తామంటున్నారు. మా బాధలను తీర్చమని ఆ బగవంతుడే మిమ్మల్ని అంపించి ఉంటాడు. నే ఎళ్లి తీసుకు వత్త తల్లి! మీకు అబ్బెంతరం నేకపోతే ఇలా కూసోండి తల్లి!'' అంటూ ప్లాస్టిక్ కుర్చీ తెచ్చి వేసింది. కారు దగ్గర ఉన్న ఆమె భర్తను కూడా పిలిచింది. ఆయన కుర్చీ మీద, ఆవిడ చెక్కపెట్టె మీద కూర్చున్నారు.

''భారతి టీచర్!''.. వయసు పైబడిన ఛాయలు తప్ప ఆమెలో పెద్దగా మార్పు లేదు. పరుగున వెళ్లి ఆవిడ కాళ్ల మీద పడ్డాను. ఆవిడ తెల్లబోయి చూసినా వెంటనే గుర్తుపట్టారు.

''సుమా! నువ్వేంటి ఇలాంటి చోట!?'' అంటున్న ఆవిడ బాధాకరమైన ప్రశ్నకు నా గాథ అంతా కన్నీళ్ల మధ్య వెళ్లబోసుకున్నాను. భార్యాభర్తలిద్దరూ చాలా బాధపడ్డారు.

''చక్కగా సుమ అని పేరు పెట్టుకున్న నీ జీవితం పువ్వులాగే వాడిపోయింది తల్లీ!'' అంటూ కన్నీళ్ల పర్యంతం అయ్యారు.

''నువ్విక్కడ ఉండటానికి వీల్లేదు సుమా! నీ పాపకు మంచి భవిష్యత్తును ఇవ్వాలి. మేం నిన్ను తీసుకెళ్లి నీ కాళ్ల మీద నువ్వు నిలబడేలా చేస్తాం. నీకు అండగా ఉన్న గంగవ్వ కూడా నీతోనే వస్తుంది'' అన్నారు అంకుల్.

''నేను వస్తే మీకు మీకు..'' అంటూ మాట పూర్తి చేయలేకపోయాను.

''మంచిపని చేయడానికి మేం ఎవ్వర్నీ లెక్కచేయం. నువ్వు ఎలాంటి భయాలు, శంకలు పెట్టుకోకు!'' అంటున్న శివపార్వతుల్లాంటి వాళ్ల కాళ్ల మీద పడితే నా బాధలన్నీ దూరమైనట్లు, నాకు నిజమైన రక్షణ లభించినట్లు అనిపించింది. ఇప్పుడు గంగవ్వ నా పాపకు అమ్మమ్మగా నాతోనే ఉంది. అమ్మ, తమ్ముడు ఇద్దరి గురించీ వాకబు చేస్తానని అంకుల్ మాట ఇచ్చారు. ■

## తాడిమేటి శ్రీదేవి



పాఠకుల మనసులను గెలుచుకునేలా కథలను మలచడంలో రచయిత్రి తాడిమేటి శ్రీదేవి నిష్ణాతులు. వీరి స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం చెరుకువాడ గ్రామం. ఎంఏ, బీఎస్సీ, బీఈడీ చేశారు. ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా విరమణ పొందారు. సాహిత్యాభిలాషతో 1998 నుంచి కథలు, కవితలు రాస్తున్నారు. వీరు రాసిన పలు కథలు ఈనాడు, ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయ్యాయి. ఆంధ్రభూమి పత్రిక నిర్వహించిన కథల పోటీలో.. 'రీఛార్జ్' కథ రూ.2000 ప్రత్యేక బహుమతి గెలుచుకున్నది. ఈనాడు ఆదివారం అనుబంధంలో ప్రచురితమైన 'అలా అలా అనంతంగా', 'ఓ తల్లి తీర్పు', 'వాక్భూషణం భూషణం', 'లక్ష్మణరేఖ' కథలు పాఠకుల మన్ననలు పొందాయి. నమస్తే తెలంగాణ – ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీ – 2022లో వీరి కథ.. 'కంచె' రూ.2000 బహుమతి పొందింది.